# 13న జాతీయ మెగా లోక్ అదాలత్

**మెదక్ ఎస్‌పి శ్రీనివాసరావు**

**మెదక్ టౌన్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:**
జాతీయ మెగా లోక్ అదాలత్ ఈ నెల 13 వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు.రాజీ పడదగిన కేసులు వేగంగా పరిష్కారం కానున్నాయని ఆయన తెలిపారు.క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన, కుటుంబ పరమైన వివాదాలు, రోడ్డు ప్రమాదాలు, చిన్నచిన్న దొంగతనాలు, వైవాహిక సమస్యలు, డ్రంక్ అండ్ డ్రైవ్, టౌన్ న్యూసెన్స్, బ్యాంకు రికవరీ, టెలిఫోన్ రికవరీ కేసులు, చెక్ బౌన్స్ తదితర కేసులు ఉన్నాయి.ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, న్యాయశాఖ అందిస్తున్న ఈ ప్రత్యేక అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు.లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని, చిన్నచిన్న కేసుల కోసం కోర్టు చుట్టూ తిరగకుండా ఈ లోక్ అదాలత్ ఉపయోగించుకోవడం సమాజానికి మేలని ఆయన స్పష్టం చేశారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

## క్రీడల్లో సత్తాచాటిన సిర్గాపూర్ విద్యార్థులు

**సిర్గాపూర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** మండలంలో కొనసాగుతున్న క్రీడా పోటీల్లో సిర్గాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ సత్తాచాటుకున్నారు. క్రీడా పోటీల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో అండర్-14 విభాగంలో పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని అధికారులు పేర్కొన్నారు. పోటీల్లో కస్తూర్బా,ఎస్సీ బాలికల గురుకులం విద్యార్థినులు తలపడ్డారు.



వాలీబాల్ పోటీలో తలపడుతున్న విద్యార్థినులు



అధికారులతో మాట్లాడుతన్న కలెక్టర్ ప్రావీణ్య

## విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు

**రూ.7 కోట్లతో నూతన హాస్టల్ భవన నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు**

**సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కలెక్టర్**

**మునిపల్లి, సెప్టెంబరు 9(ప్రభాతవార్త):** మండలంలోని తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ స్కూల్ పాత డార్మిటరీ బ్లాక్ మంగళవారం మధ్యాహ్నం కూలిన ఘటనలో విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం లేదని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య అన్నారు. ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే కలెక్టర్ లింగంపల్లి రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఎస్‌డిఆర్‌హెచ్ బృందం చేపట్టిన సహాయక చర్యలను కలెక్టర్ పర్యవేక్షించారు. తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న మునిపల్లి మండలం,లింగంపల్లి గురుకుల పాఠశాలలో 1984లో నిర్మించిన పాత హాస్టల్ భవనంలో మంగళవారం మధ్యాహ్నం గోడ కూలిన ఘటన చోటుచేసుకుంది. విషయం తెలిసిన వెంటనే కలెక్టర్ ప్రావిణ్య హుటాహుటిన గురుకుల పాఠశాలకు చేరుకున్నారు.గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి నుంచి ఇంటర్ వరకు 601 మంది విద్యార్థులు చదువుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో విద్యార్థులంతా తరగతి గదిలో ఉండడంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. ఆ సమయంలో హాస్టల్ భవనం పక్కగా వెళుతున్న ముగ్గురు విద్యార్థులు ఈ ఘటనలో స్వల్పంగా గాయాలయ్యాయని, వారికీ జహీరాబాద్ ఏరియాఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.పాఠశాలలో ఎస్డిఆర్ఎఫ్ బృందం కూలిన మట్టి తొలగింపు మట్టి శిఖరాల కింద ఉన్న విద్యార్థుల ట్రంకు బాక్సులు వ్యక్తిగత సామాగ్రిని సురక్షితంగా బయటకు తీస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ప్రమాదకరమైన శిథిలావస్థకు చేరిన భవనాల వద్దకు వెళ్లకుండా కౌన్సిలింగ్ కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు విద్యార్థులకు తాత్కాలికంగా వసతికి ఇలాంటి ఇబ్బందులు లేవని అందుబాటులో ఉన్న తరగతి గదులు, హాస్టల్ గదుల్లో తాత్కాలిక వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంజనీరింగ్ శాఖ (ఈఈడబ్ల్యూ ఐడిసి) అధికారులు సంఘటనా స్థలంలో పాడైన భవనాలను కూల్చివేయడం, వినియోగించటానికి వీలుగా వుండే గదులకు తక్షణ మరమ్మతులు చేపట్టడం లాంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. రాత్రి సమయంలో పనులు కొనసాగేందుకు తాత్కాలికంగా లైటింగ్ కూడా ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. గురుకుల పాఠశాలకు నూతన హాస్టల్ భవన నిర్మాణం కోసం రూ .7 కోట్లతో ప్రభుత్వానికి ఆమోదం కోసం ప్రతి పనులకు సమర్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం పాఠశాలల్లో పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని విద్యార్థుల భద్రతకు ఎలాంటి సమస్యలు లేవని అధికారులు నిరంతరం పర్యవేక్షిన్నట్లు కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.

### కూలిన హాస్టల్ భవనాన్ని సందర్శించిన మంత్రి



కూలిన భవనాన్ని రిశీలిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహా

**మునిపల్లి, సెప్టెంబరు 9(ప్రభాతవార్త):** వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా మునిపల్లి మండలం లింగంపల్లిలోని గురుకుల పాఠశాలలో ప్రమాదవశాత్తు హాస్టల్ గోడ కూలి ముగ్గురు విద్యార్థులు స్వల్పంగా గాయపడిన ఘటన ప్రదేశాన్ని పరిశీలించారు. జరిగిన ఘటనపై అధికారులతో మంత్రి చర్చించారు. హాస్టల్‌లోని మిగిలిన భవనాల స్టాండర్డ్స్ ను పరిశీలించి ఉపయోగానికి పనికిరానివాటిని బ్లాక్‌చేసి నివేదిక సమర్పించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహా అధికారులను ఆదేశించారు. హాస్టల్ గోడ కూలి స్వల్పంగా గాయపడిన ముగ్గురు (3) విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని హాస్టల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గురుకుల విద్యార్థుల క్లాస్‌లు యధావిధిగా కొనసాగేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలనీ జిల్లా అదనపు కలెక్టర్‌ను మంత్రి ఆదేశించారు.

## కోర్టు భవన నిర్మాణానికి స్థల పరిశీలన

**దుబ్బాక, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** పట్టణ పరిధిలో పురాతన భవనంలో జూనియర్ సివిల్ జడ్జి కం జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు ఉండడం జరిగింది. వర్షాకాలంలో కోర్టు భవనం తడవడం జరుగుతుంది. ఇందుకుగాను దుబ్బాక పట్టణంలో ఉన్న పురాతన కోర్టు భవనాన్ని తొలగించి కొత్త భవనం ఏర్పాటుతో పాటు క్వార్టర్ నిర్మాణం కోసం జిల్లా కలెక్టర్ హైమావతితో పాటు ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ అండ్ సెషన్ జడ్జి సాయి రమాదేవి, ఫస్ట్‌క్లాస్ అడిషనల్ అండ్ డిస్ట్రిక్ సెషన్ జడ్జి జయప్రసాద్ కలసి స్థలాన్ని పరిశీలించారు. పట్టణంలోని ప్రభుత్వ స్థలా లను పరిశీలించి కోర్టుకు అనుకూలంగా ఉండే ప్రదేశాలను పరిశీలించారు. కోర్టు పునర్ నిర్మాణం కోసం అలాగే క్వార్టర్స్ కోసం తగిన విధంగా ఏర్పాటు చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో దుబ్బాక కోర్టు జడ్జి టి. జితేందర్, ఆర్డీవో సదానందం, మున్సిపల్ కమిషనర్ కళ్యాణ్ రమేష్ కుమార్, తహసిల్దార్ సంజయ్ కుమార్, దుబ్బాక బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సంజీవరెడ్డి, కోర్టు సిబ్బంది, రేవని సిబ్బంది పాల్గొన్నారు.



కోర్టు భవనం, క్వార్టర్స్ స్థలాన్ని పరిశీలించిన సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి, ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్ జడ్జి సాయి రమాదేవి

# పండుగ వాతావరణలో 'ఏక్ పేడ్ మాకే నామ్'

**మొక్కలు నాటిన సిద్దిపేట జిల్లా కలెక్టర్... ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటిన ఉద్యోగులు**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
ఒక ఉద్యోగి ఒక మొక్క ఏక్ పెడ్ మాకే నామ్ (తల్లి పేరున ఒక మెక్క) నాటే కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ కె,హైమావతి పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖల అధికారులు మంగళవారం పండుగవాతావరణంలో మొక్కలునాటారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో, పోలీసు కార్యాలయాలు, పోలీసు స్టేషన్ల ఆవరణలో ప్రతి ఉద్యోగి తల్లి పేరును ఒక మొక్కనాటే కార్యక్రమంలో పాల్గొని తమ వంతుగా మొక్క నాటారు. జిల్లా వ్యాప్తంగా 15 వేల మొక్కలను నాటారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్, జిల్లా అదనపు కలెక్టర్, వివిధశాఖల ఉద్యోగులు జిల్లా అధికారుల నివాసగృహాల సముదాయం సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్థలం వరకు ర్యాలీగా వచ్చి జిల్లా కలెక్టర్‌తో సహా జిల్లా స్థాయి అధికారులు,ఉద్యోగులు ఒక్కో ఉద్యోగి ఒక్కొక్క మొక్క నాటారు. అనంతరం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ సిద్దిపేట అక్సిజన్ పార్కులో ఒక్కో ఉద్యోగి ఒక్కో మొక్క నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. వనమహోత్సవ కార్యక్రమం ద్వారా 22.827 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టుకొని వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా 23.329 వంద శాతంకు పైగా మొక్కలు నాటి రాష్ట్రంలోని జిల్లానే ప్రథమ స్థానంలో నిలపడం జరిగిందన్నారు. తల్లి పేరున నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి జయదేవ్ అర్యా, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న జిల్లా కలెక్టర్ తదితరులు

**సీపీ ఆధ్వర్యంలో...**

ఒక ఉద్యోగి ఒక మొక్క ఏక్ పెడ్ మాకే నామ్ (తల్లి పేరున ఒక మెక్క) నాటే కార్యక్రమంలో భాగంగా చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు గ్రామ శివారు సిఎఆర్ హెడ్ క్వార్టర్‌లో, సీపీ కార్యాలయంలో పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి సీపీ డాక్టర్ అనురాధ మొక్కలు నాటారు. రూరల్ పోలీసు స్టేషన్, భరోసా సెంటర్, సఖీ సెంటర్ అవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ భావితరాలను దృష్టిలో పెట్టుకొని మొక్కలు నాటాలన్నారు. నేటీ మొక్కలే రేపటి వృక్షాలు అన్నారు. నాటిన ప్రతి మొక్కను జియో ట్యాగింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు కుశాల్కర్, సుభాష్‌చంద్రబోస్, పూర్ణచందర్, రాజేష్, విష్ణుప్రసాద్, శీను పాల్గొన్నారు.

### స్కావెంజర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

**సిర్గాపూర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** సిర్గాపూర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అటెండర్, నైట్ వాచ్‌మెన్, అసిస్టెంట్ కుక్, స్కావేంజర్ పోస్టులకు అర్హులైన వారు ధరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ప్రత్యేక అధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నైట్ వాచ్‌మెన్, అటెండర్‌గా పనిచేసేందుకు 10వ తరగతి చదివి ఉండి 18 సంవత్సరాలు నిండి 45 సంవత్సరాల లోపు వయసు గలవారై ఉండాలన్నారు. అసిస్టెంట్ కుక్, స్కావేంజర్ పోస్టులో చేరేందుకు 7వ తరగతి చదివి 18 నుంచి 45 సంవత్సరాలలోపు వయసు కలిగి ఉండాలన్నారు. నైట్ వాచ్‌మెన్‌గా పనిచేసేందుకు సెక్యూరిటీ ఎజన్సీ ద్వార శిక్షణ పొంది ఉండాలన్నారు. మహిళ అభ్యర్థులు ఈ నెల 10వ తేదీలోపు సిర్గాపూర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ధరఖాస్తులు చేసుకోవాలని ప్రత్యేక అధికారి సూచించారు.

### అభివృద్ధి పనులను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

**వర్గల్, సెప్టెంబర్ 9 (ప్రభాతవార్త):** గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి మంగళవారం వర్గల్ మండలకేంద్రంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించిన ఆయన త్వరలోనే పనులు పూర్తిచేసి గృహప్రవేశాలు చేయాలని లబ్ధిదారులకు సూచించారు. అలాగే సిసి రోడ్డు నిర్మాణాలు పరిశీలించగా, అవసరమైన ప్రతి చోట అంతర్గత రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించనున్నట్లు స్పష్టం చేశారు. గజ్వేల్ నియోజకవర్గంలో సిఎం రేవంత్‌రెడ్డి 3,500 ఇండ్లు కేటాయించగా, వివిధ దశలలో ఉన్నాయని, లబ్ధిదారులకు ఇప్పటికే మొదటి విడత రూ.లక్ష చొప్పున అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలను పార్టీలకతీతంగా, పారదర్శకంగా వర్తింపజేస్తుండగా, పేద వర్గాలకు న్యాయం చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. ఈకార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, మాజీ ఎంపిపి మోహన్, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపిటిసిలు ప్రవీణ్‌రెడ్డి, నీల శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ పొన్నాల నర్సారెడ్డి, కాంగ్రెస్ పార్టీ వర్గల్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న నర్సారెడ్డి



మొక్కలు నాటుతున్న ఏసిపి సైదారపు సదానందం

### ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి : ఎసిపి

**హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** ఆహ్లాదకరమైన వాతావరణం కోసం ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని ఎసిపి సౌదారపు సదానందం అన్నారు. మంగళవారం హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఒక ఉద్యోగి, ఒక మొక్క(ఏక్ సెడ్, మాకే నామ్) తల్లి పేరుపైన ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా సిఐ కోంద్ర శ్రీనివాస్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటడంతో పాటు సంరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. నేటి మొక్కలే రేపటి వృక్షాలని, భావితరాలకు ఆహ్లాద వాతావరణం అందిం చడానికి మొక్కలు నాటడం తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

**ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో....**

పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో తల్లి పేరు పైన ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ లలిత సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటా నికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అధ్యాపక బృధం కర్ణాకర్, సధానందం, నిర్మళాదేవి, లక్ష్మయ్య, సంపత్, కవిత, స్వరూప, కవిత, ఆస్మ, కుమారి, రాణితో పాటు తదితరులు ఉన్నారు.

### నూతన చైర్మన్‌కు సన్మానం...

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త**

తెలంగాణ రెడ్ కో(టీజీ రెడ్‌కో) నూతన చైర్మన్‌గా నియమితులైన డాక్టర్ శరత్ నాయక్ మంగళవారం వారి కార్యాలయంలో బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్ర రమేష్ చౌహాన్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. వారితో పాటు చంద్రమోహన్ పాల్గొన్నారు.



కాళోజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ

**తెలంగాణ కవితకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన**

## మహాకవి కాళోజీ : మెదక్ ఎస్పీ శ్రీనివాస్‌రావు

**మెదక్ టౌన్, సెప్టెంబరు 9 ప్రభాతార్త :** జాతీయ కవి, ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు ఈ కార్యక్రమంలో పాల్గొని కాళోజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ – కాళోజీ తెలంగాణకు కవిత్వం ద్వారా ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చిన మహానుభావులు అని పేర్కొన్నారు. ఆయన రచనలు సామాజిక చైతన్యాన్ని పెంపొందిచేలా, ప్రజా హక్కుల కోసం నడిపించేలా ఉంటాయని గుర్తుచేశారు. ఉద్యమకారుడిగా, కవిగా ఆయన సమాజానికి చేసిన సేవలు మరువలేనివని అన్నారు.జిల్లా పోలీసులు తమ విధుల్లో ప్రజాసేవను ప్రధాన ధ్యేయంగా తీసుకుని, కాళోజీ గారి ఆలోచనలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని ఎస్పీ సూచించారు.ఈ కార్యక్రమంలో మెదక్ అదనపు ఎస్పీ ఎస్ మహేందర , సైబర్ క్రైమ్ డియస్పి . సుభాష్ చంద్ర బోస్ , ఏఆర్ డియస్పి రంగా నాయక్ ,ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీ. ఎస్ సందీప్ రెడ్డి , దీదిళితీ ఇన్స్పెక్టర్ శ్రీ. మధు సుధన్ గౌడ్ , ఆర్ఐ లు శ్రామకృష్ణ , శ్రీ. శైలందర్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## 13న జాతీయ లోక్ అదాలత్

**-సంగారెడ్డి జిల్లా ఎస్‌పి పరితోష్ పంకజ్**

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** ఈ నెల 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్‌పి పరితోష్ పంకజ్ సూచించారు. క్షణికావేశంలో చేసిన తప్పులను సరిదిద్దుకునే అవకాశం లోక్ అదాలత్ ద్వార కల్గుతుందని, అందుకు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అపరిష్కృతంగా ఉన్న కేసులను పరిష్కరించుకునేందుకు రాజీ మార్గమే నయమన్నారు. క్రిమినల్ కంఎపౌండబుల్, సివిల్, ఆస్తి విభజన, కుటుంబ పరమైన, వైవాహిక జీవితానికి సంబంధించిన, బ్యాంక్ రికవరీ, విద్యుత్ చోరీ, చెక్ బౌన్స్ లాంటి కేసులను రాజీ మార్గం ద్వార పరిష్కరించుకుని సమయాన్ని, డబ్బులను ఆదా చేసుకోవాలని ఎస్‌పి జిల్లా ప్రజలకు సూచించారు. అధికారులు తమ వంతు చొరవ తీసుకుని కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.

### విద్యుదాఘాతంతో యువ రైతు మృతి

**చిలిపిచెడ్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** వ్యవసాయ క్షేత్రంలో ప్రమాదవశాత్తు విద్యుత్తు షాక్‌కుగురై యువ రైతు మృతి చెందినఘటన చిలిపిచెడ్ మండలంలో మంగళవారం ఉదయం జరిగింది. చిట్కూల్ గ్రామానికి చెందిన బ్రాహ్మణపల్లి శివకుమార్(27) వ్యవసాయ పొలంలో గడ్డి కోత మిషన్‌తో గడ్డి కోస్తుండగా విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

### పాము కాటుకు మహిళ మృతి

**వెల్దుర్తి, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:** మాసాయిపేటకు చెందిన బాలమణి(52) సోమవారం రాత్రి పాముకాటుకు గురై మృతి చెందింది. రోజు మాదిరిగానే కూలి పనికి వెళ్లి వచ్చి రాత్రి కొడుకుతో కలిసి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఏదో గుర్తు తెలియని పాము ఎడమచేతికి కాటు వేయగా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందిందని కుటుంబీకులు తెలిపారు. కుమారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

**వెల్దుర్తి, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:** ఆర్థిక ఇబ్బందులతో ఒక వ్యక్తి గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందిన సంఘటన మండలంలోని అందుగులపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబీకుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన పి.సత్యనారాయణ (59)కు ఆర్థిక ఇబ్బందులు, భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండడంతో మనస్థాపానికి గురైన సత్యనారాయణ ఈనెల 7న గడ్డి మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన భార్య సునీతతో పాటు గ్రామస్తులు అతడిని మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. హైదరాబాదులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య సునీతతో పాటు శిరీష. కుమారుడు విక్రమ్ ఉన్నారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### ఆగిన బస్సును ఢీకొన్న కారు

**-ముగ్గురికి తీవ్రంగా గాయాలు**

**అల్లాదుర్గం, సెప్టెంబరు 9,ప్రభాతవార్త:** 161వ జాతీయ రహదారిపై ఆగి ఉన్న ఆర్టీసి బస్సును కారు ఢీకొన్న సంఘటలో ముగ్గురు వ్యక్తులు తీవ్ర గాయాలకు గురైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కామారెడ్డి జిల్లా పిట్లంకు చెందిన సాయి, కోటగిరికి చెందిన స్నేహిత్ కారులో హైద్రాబాద్ వెళుతున్న క్రమంలో అల్లాదుర్గం పోలీసు ఠాణా పరిధిలోని రాంపూర్ వద్ద 161వ జాతీయ రహదారిపై ఆగి ఉన్న బస్సును వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో ప్రమాదంలో కారు డ్రైవర్‌తో పాటు కారులో ప్రయాణిస్తున్న సాయి, స్నేహిత్‌లు గాయాలకు గురయ్యారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



నుజ్జునుజ్జయిన ఆగిన బస్సును ఢీకొన్న కారు

# కూలిన గురుకుల హాస్టల్ భవనం

**ముగ్గురు విద్యార్థులకు గాయాలు..**

**పాఠశాలను సందర్శించిన మంత్రి దామోదర, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

**గాయపడిన విద్యార్థులను పరామర్శించిన ఎస్పీ పరితోష్ పంకజ్**

**జహీరాబాద్/మునిపల్లి సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
లింగంపల్లి గురుకుల పాఠశాల భవనం కూలి ముగ్గురు విద్యార్థులు తీవ్ర గాయాలకు గురైన సంఘటన మంగళవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. పాఠశాల డార్మెంటరీ భవనం స్లాబు కూలిపోవడంతో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో విద్యను అందుకుంటున్న న్యాల్‌కల్ మండలం న్యామతాబాద్ గ్రామానికి చెందిన శివానంద్, రాయికోడ్ చౌరస్తాకు చెందిన 10వ తరగతి విద్యార్థి జ్ఞానేశ్వర్, అరవింద్‌లు తీవ్ర గాయాలకు గురయ్యారు. క్షతగాత్రులను జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందచేస్తున్నారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా హస్టల్‌ను సందర్శించారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సంఘటన స్థలాన్ని పరిశీలంచారు. విద్యార్థులను సురక్షిత గదుల్లోకి తరలించాని సూచించారు. రూ. 7కోట్లతో నూతన భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతున్నట్టు ఆమె ప్రకటించారు. అదేవిధంగా విద్యార్థులు ప్రమాదానికి గురైనట్లు తెలుసుకున్న జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్‌పి పరితోష్ పంకజ్‌లు ఆసుపత్రికి చేరుకుని విద్యార్థుల పరిస్థితిని డాక్టర్‌లను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్‌లకు సూచించారు. పాడుబడ్డ భవనాన్ని తొలగించి కొత్త భవనాన్ని నిర్మించేందుకు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆర్‌అండ్‌బి ఈఈని ఆదేశించినట్లు డిఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు.
తీవ్రంగా గాయపడిన ఓ విద్యార్థిని సంగారెడ్డి ఆసుపత్రికి మెరుగైన చికిత్స కోసం తరలించినట్లు డిఈఓ వివరించారు.





కూలిన హాస్టల్ భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, పక్కనే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించిన ఎస్పీ, డిఈఓ

## గురుకులంలో తెలుగుభాషా దినోత్సవం

**నారాయణఖేడ్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:**

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలోని మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలలో తెలంగాణ తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు పండితులు అయిన ప్రిన్సిపల్ రాములు, అశోక్, రమేష్, బుజ్జమ్మలను ఉపాధ్యాయబృందం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల మాజీ ప్రధానోపాధ్యాయులు యం.ఎ.ఖాదర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో ఘనంగా తెలుగుభాషా దినోత్సవం

**జోగిపేట, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:**

జోగిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో మంగళవారం తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా కళాశాలకు చెందిన అధ్యాపకులు మాట్లాడుతూ తెలుగుభాషా వైశిష్ట్యాన్ని విద్యార్థులకు తెలియచేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ పండరి, శ్రీకాంత్, సంధ్య, శివకుమార్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులను పెట్టుబడిదారులకు కట్టబెడుతున్న కేంద్ర ప్రభుత్వం

**-లేబర్ కోడ్స్ అమలుకు వ్యతిరేకంగా ఉద్యమం**

**-సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్**




సెమినార్‌లో మాట్లాడుతున్న జె.మల్లికార్జున్ తదితరులు

**నర్సాపూర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

కార్మికుల హక్కులను పెట్టుబడిదారులకు కట్టబెడుతున్న కేంద్రప్రభుత్వంపై, కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా ఉద్యమం చేస్తామని, డిసెంబర్ 7,9 తేదీల్లో మెదక్‌లో సిఐటియు తెలంగాణ రాష్ట్ర 5వ మహాసభలు నిర్వహిస్తున్నామని, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్ తెలిపారు. మంగళవారం నర్సాపూర్ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ విధానాలు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై, కార్మికుల సమస్యలపై మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కదారి నాగరాజు, నాయకులు చెంద్రయ్య, నర్సింలు, పెంటయ్య, రుబ్లీ, పుష్ప, అనిత తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాలకవుల సమ్మేళనం



విజేతలకు బహుమతులను అందజేసిన ఉపాధ్యాయులు తదితరులు

**నర్సాపూర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని నర్సాపూర్ సమీపంలోని విష్ణు ఉన్నతపాఠశాలలో తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా బాలకవుల సమ్మేళనాన్ని సైతం నిర్వహించారు. ముందుగా కాళోజీ నారాయణరావు చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా విద్యార్థులకు వివిధపోటీలు నిర్వహించగా 7, 8 తరగతుల విద్యార్థులు తెలంగాణభాషపై నాట్యప్రదర్శన చేశారు. అంతేగాక యుకెజి నుండి రెండవ తరగతి విద్యార్థులకు వివిధ పోటీలు, 8,9,10 తరగతుల విద్యార్థులకు బాలకవి సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈపోటీల్లో ప్రతిభచూపిన విద్యార్థులందరికి ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, ఉపప్రధానోపాధ్యాయులు విశ్వనాథ్‌ల చేతులమీదుగా బహుమతులను అందజేశారు. ఈకార్యక్రమాన్ని తెలుగు ఉపాధ్యాయుడు ఉమాకాంత్, తులసి, సుజాత, రాధారాణి ఆధ్వర్యంలో విజయవంతంగా ముగిసింది. కార్యక్రమంలో ఉపాధ్యాయబృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లకు గుంత... ప్రయాణికులకు చింత

**-రోడ్డుపై గుంతలు ఉన్నాయి జాగ్రత్త**



మెదక్-చేగుంట రహదారి, కొర్విపల్లి శివారులో రోడ్డు మధ్యలో గుంత

**చిన్నశంకరంపేట, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

అధికారుల నిర్లక్ష్యంవల్ల మండలంలోని ప్రధాన రహదారులన్నీ ధ్వంసమవుతున్నాయి. రోడ్లకు ఎక్కడికక్కడ గుంతలు పడటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నశంకరంపేట మండలపరిధి కొర్విపల్లి వద్ద మెదక్-చేగుంట ప్రధానరహదారిపై పెద్ద గుంత ఏర్పడింది. ఫలితంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆగుంతలో నీళ్లు ఉండటంతో ఏదిగుంతో, ఏదిరోడ్డో ప్రయాణికులు తేల్చుకోలేకపోతున్నారు. మెదక్‌నుండి భాగ్యనగరానికివెళ్లే ప్రధానరహదారి కావడంతో రోజూ వందల మంది ప్రయాణిస్తూ ఉంటారు. పగలే ప్రమాదాలబారిన పడుతుంటే రాత్రి అయితే ప్రయాణించాలంటే జంకుతున్నారు. అలాగే చిన్నశంకరంపేట పట్టణం పద్మనాభస్వామిగుట్ట వద్ద, సంగాయపల్లి-మదూర్, రామాయపల్లి-ఖాజాపూర్ ప్రధాన రహదారి మధ్యలో అడ్డంగా రోడ్డును తవ్వి తూతూ మంత్రంగా మట్టినిపోశారు. అక్కడ గుంతలు ఏర్పడటంతో ఇటీవల ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలబారిన పడ్డారు. అధికారులు స్పందించి వెంటనే గుంతలుపడిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు అధికారులను కోరుతున్నారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం మిషన్ శక్తి జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో 10రోజుల ప్రత్యేక అవగాహన కార్యాక్రమంలో భాగంగా మంగళవారం బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించి న్యాయమూర్తి విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంసథ కార్యదర్శి సౌజన్య విద్యార్థులకు జువెనైల్ జస్టిస్ యాక్ట్, పోక్సో యాక్ట్ తదితర బాలచట్టాలపై అవగాహన కల్పించారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని వివరించారు. విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలోపెట్టుకుని క్రమశిక్షణతో విద్యను అందుకోవాలన్నారు. పిల్లల వివాహ చట్టం, మహిళల రక్షణ చట్టాలపై అవగాహన పొంది ఉండాల్సిన అవసరం ఉందన్నారు. లింగ సమానత్వం, మహిళ సాధికారత సమాజ అభివృద్ధికి కీలమని న్యాయమూర్తి సౌజన్య సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ షేక్ ఇబ్రహీం, ఎస్ఐ నర్సింలు, ఎక్స్‌బిషన్ ఎస్ఐ దిలీప్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజాకవి కాళోజీ సేవలు మరువలేనివి...

**-రామాయంపేట తహసీల్దార్ రజినికుమారి**



తహసీల్దార్ కార్యాలయంలో కాళోజీ నారాయణరావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**రామాయంపేట మున్సిపాలిటీ సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు కాళోజీ నారాయణరావు అని రామాయంపేట తహసీల్దార్ రజనికుమారి కొనియాడారు. ఆయన జయంతిని పురస్కరించుకొని రామాయంపేట మండల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో కాళోజీ చిత్రపటానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రజినికుమారి మాట్లాడుతూ కాళోజీ కేవలం కవి మాత్రమే కాదు, సమాజాన్ని ఉద్ధరించేందుకు కలాన్ని ఆయుధంగా మార్చుకున్న యోధుడు అన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, సమాజాన్ని పరిశుభ్రంగా ఉంచడం మనందరి బాధ్యత అని పిలుపునిచ్చారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు ఆరోగ్య పరిరక్షణపై దృష్టిపెట్టాలని సూచించారు. తాగు నీటిని కాచి, చల్లార్చి తాగడం ద్వారా జల వ్యాధులను నివారించవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నవీన్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గౌస్ మొయినుద్దీన్, రూరల్ ఆర్ఐ గోపి, కార్యాలయ సిబ్బంది సుష్మ, రోజా, చంద్రకళ, సౌమ్య, మైసయ్య, కార్తీక్, రవి, పద్మ తదితరులు పాల్గొన్నారు. కాళోజీ జయంతిని పురస్కరించుకొని పలువురు అధికారులు, ఉద్యోగులు కాళోజీ రచనలను సందర్శించి, ఆయన జీవిత విశేషాలను తెలియజేసే కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు.

## నవసమాజ మార్గదర్శకులు ఉపాధ్యాయులు

**-జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్**

**పాపన్నపేట, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

ఉపాధ్యాయులు నవసమాజ మార్గదర్శకులని జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ పేర్కొన్నారు. మంగళవారం పావన్నపేటలో జరిగిన మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆదర్శవంతమైన సమాజాన్ని తయారు చేసే శక్తి ఉపాధ్యాయునికే ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పరిపూర్ణ వికాసవంతమైన విద్య అందుతుందని చెప్పారు. ఒత్తిడిలేని విద్య అందించే కేంద్రాలు సర్కార్ బడులేనని తెలిపారు.

**28మంది ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు...**

పాపన్నపేట మండలస్థాయిలో విశిష్టసేవలు అందించిన 28మంది టీచర్లకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందించారు. వీరితోపాటు మండలం నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికైన సాయిసిరికి, జిల్లాస్థాయికి ఎంపికైన సాయిలు, చంద్రశేఖర్, మల్లేశం, దుర్గాప్రసాద్‌లకు పురస్కారాల అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఓ ప్రతాప్‌రెడ్డి, డిఎస్ఓ రాజిరెడ్డి, హెచ్ఎంలు మహేశ్వర్, శ్రీనివాస్‌రావు, ఆరోగ్యం, పిఆర్టీయు నాయకులు రాజు, వెంకట్రాంరెడ్డి, టివిటిఎఫ్ నాయకులు బాల్రాజ్, ఎస్టీయు నాయకులు ఎల్లం, నాయకులు మంగ, నర్సింలు, టీచర్లు, అంజాగౌడ్ పాల్గొన్నారు.

## మాతృభాషను మరువవద్దు..

**-గెజిటెడ్ హెడ్మాస్టర్ శ్రీనివాసరావు**

**నారాయణఖేడ్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:**

మాతృభాషను మరువవద్దని, మాతృభాషతోనే మనుగడ సాధ్యమని గెజిటెడ్ హెడ్మాస్టర్ శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల నిజాంపేటలో తెలంగాణ ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని తెలంగాణభాషా దినోత్సవాన్ని ఉపాధ్యాయులు సత్యనారాయణ, కాశీనాథ్ పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సీనియర్ ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, దేవిసింగ్ గురూజీ, హరి, మారుతి, విజయ్‌కుమార్, నారాయణ భారతి, సుశీల, సురేఖ, మారుతి, సత్యనారాయణ, లక్ష్మణ్, వెంకటరెడ్డి, నరసింహులు, భ్రమరాంబ, నాగమణి విద్యార్థినీవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పాఠశాలలో పదవతరగతి చదువుతున్న సంధ్య అనే విద్యార్థిని తన తెలుగు ఉపాధ్యాయుని సహకారంతో రచించిన ఆటవెలది కవితలను చదివి వినిపించి సభికులను మెప్పించి ప్రశంసలు అందుకుంది. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకొనగా గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవం జరిగింది.

## ప్లాస్టిక్ వ్యర్థాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మున్సిఫల్ అధికారులు, తదితరుల

**నర్సాపూర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని గురుకుల కళాశాలలో ప్లాస్టిక్ వ్యర్థాలు కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం 100రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి ఆదేశాలమేరకు మున్సిపాలిటీ పరిధిలోని గురుకుల కళాశాలలోని విద్యార్థులకు ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగంపై, నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ మహేష్‌తోపాటు ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ శ్రీకాంత్, వార్డు అధికారులు ఉదయ్, రాములు, బేసిల్ ఫౌండేషన్ ప్రతినిధి విష్ణు, కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ బాలాజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 13న లోక్ అదాలత్-ఎస్ఐ కోటేశ్వరరావు

**మనూర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

ఈ నెల 13న నియోజకవర్గ కేంద్రమైన నారాయణఖేడ్‌లోని కోర్టులో లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. అపరిష్కృతంగా ఉన్న కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకునే అవకాశం లోక్‌అదాలత్ ద్వారా కలుగుతుందని, అందుకు కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ కోటేశ్వరరావు మండల ప్రజలకు సూచించారు. లోక్ అదాలత్‌కు సంబంధించిన వివరాలను పోలీసు ఠాణాను సంప్రతించి తెలుసుకోవచ్చన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**-రామాయంపేట ఎస్సై బాలరాజు..**

**రామాయంపేట మున్సిపాలిటీ, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

సైబర్‌నేరాల పట్ల ప్రజలు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని రామాయంపేట ఎస్ఐ బాలరాజు సూచించారు. నేటి డిజిటల్ యుగంలో సాంకేతికతను ఆయుధంగా మలుచుకున్న సైబర్‌నేరగాళ్లు కొత్తకొత్త పద్ధతుల్లో అమాయకులకు ఉచ్చు వేస్తున్నారని ఆయన హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు అప్రమత్తతే ప్రధాన రక్షణకవచమని సూచించారు. ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు, స్టాక్ మార్కెట్ మోసాలు, యుపిఐ మోసాలు, లోన్ ఫ్రాడ్లు, నకిలీ వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ షాపింగ్ ఆఫర్లు వంటి మోసపూరిత పద్ధతులు ప్రస్తుతం విస్తరించి ఉన్నాయని ఆయన వివరించారు. వాట్సాప్, టెలిగ్రామ్ వంటి యాప్‌ల ద్వారా పంపే ఎపికె ఫైళ్లు డౌన్‌లోడ్ చేస్తే మొబైల్ ఫోన్ మొత్తం నేరగాళ్ల నియంత్రణలోకి వెళ్లే ప్రమాదం ఉంది. సోషల్ మీడియాలో వస్తున్న పార్ట్‌టైమ్ జాబ్ ఆఫర్లకు స్పందించరాదు. ఒకవేళ మోసపోతే గోల్డెన్ అవర్‌లోనే చర్యలు తీసుకోవడం అత్యంత కీలకమని బాలరాజు హితవు పలికారు. దానికి గాను జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 కు కాల్ చేయవచ్చని, లేదా డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సైబర్‌క్రైం.జిఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో వెంటనే ఫిర్యాదు చేయాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## మండల ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంపిడివో, ఎంఈఓ, తదితరులు

**నర్సాపూర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

నర్సాపూర్ మండలపరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానంచేశారు. సోమవారం నర్సాపూర్ మండలపరిషత్ కార్యాలయంలో మండల విద్యాధికారి తారాసింగ్ ఆధ్వర్యంలో ఆద్మాపూర్ యుపిఎస్ ప్రధానోపాధ్యాయులు రవిరాజ్ సహకారంతో మండల ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కార దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపిడివో మధులత హాజరయ్యారు. ఈసందర్భంగా ఎంపిడివో మధులత, మండలవిద్యాధికారి తారాసింగ్‌ల చేతులమీదుగా మండలంలోని 40మంది ఉత్తమ ఉపాధ్యాయులను షీల్డ్, సన్మానపత్రాలు ఇచ్చి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిఓ వైద్య శ్రీనివాస్, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణీస్త్రీలకు ప్రోటీన్ కిట్ల పంపిణీ

**-మాతృదేవోభవ పథకాన్ని నిరంతరం కొనసాగిస్తాం**

**-నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి**

**నర్సాపూర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

గర్భిణీస్త్రీల ఆరోగ్యం కోసం మాతృదేవోభవ పథకంలో భాగంగా గర్భిణీలకు ప్రోటీన్ కిట్లను పంపిణీ చేస్తున్నామని, ఈ మాతృదేవోభవ పథకాన్ని నిరంతరం కొనసాగిస్తామని కాంగ్రెస్‌పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి తన సొంత నిధులతో గర్భిణీస్త్రీల ఆరోగ్యరక్షణ కోసం ప్రత్యేకంగా రూపొందించిన మాతృదేవోభవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ రాజుయాదవ్, మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్‌గుప్తా, మండల పార్టీ అధ్యక్షులు మల్లేశం, మాజీ ఎంపిపి లలిత నర్సింగ్‌నాయక్, కాంగ్రెస్ మండల వర్కింగ్‌ప్రెసిడెంట్ ఉదయ్‌కుమార్, నాయకులు రిజ్వాన్, అశోక్, సురేష్‌నాయక్, ఇలియాజ్, రవికుమార్, అశోక్, ఆంజనేయులుగౌడ్, హరీష్‌వర్ధన్, గోవింద్, సుధీర్‌గౌడ్ ఆయాగ్రామాల అంగన్‌వాడీలు, గర్భిణీలు పాల్గొన్నారు.

## జడ్పిహెచ్‌స్‌లో సాంస్కృతిక ప్రదర్శనలు

**న్యాల్‌కల్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

తెలుగు భాషా దినోత్సవం (ప్రజా కవి కాళోజి నారాయణరావు జయంతి)ని పురస్కరించుకుని మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేడుకలనుఎ ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కాళోజి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు వేషాదారణతో చేపట్టిన సంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సచ్చిదానందరెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి చైర్మన్ గార్లపల్లి మల్లేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సాంకేతికతతో వ్యవసాయంలో అద్భుత ఫలితాలు

**-జిల్లా వ్యవసాయ అధికారి దేవ్‌కుమార్**




నానోయూరియా డ్రోన్ పిచికారీ అవగాహన కార్యక్రమం దృశ్యం

**రామాయంపేట మున్సిపాలిటీ, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తే రైతులు తక్కువ ఖర్చుతో, తక్కువ శ్రమతో అధిక దిగుబడులు సాధిస్తూ అధిక ఆదాయం పొందే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్ తెలిపారు. మంగళవారం రామయంపేట మండలం, దామరచెరువు గ్రామ శివారులో రైతు శ్రీధర్‌రావు పొలంలో నానోయూరియా డ్రోన్ పిచికారీ అవగాహన కార్యక్రమం, క్షేత్ర ప్రదర్శనను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సంప్రదాయ యూరియాలో కేవలం 30 నత్రజని మాత్రమే పంటకు అందుతుంది, మిగతా పోషకాలు నీటిలో కలిసిపోవడం లేదా గాలికి ఆవిరైపోవడం వల్ల రైతులు ఎక్కువ మోతాదులో ఎరువులు వాడాల్సి వస్తుందని తెలిపారు. నానోయూరియా వాడకం ద్వారా ఎరువుల వినియోగ సామర్థ్యం పెరగడంతో పాటు రైతుల పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని చెప్పారు. నానోయూరియా వినియోగంపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ విస్తృత ప్రచారం చేపడుతోందని, రైతులు ఈసాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా, డ్రోన్ టెక్నాలజీ వినియోగంపై మాట్లాడుతూ- డ్రోన్ పిచికారీ విధానంలో కేవలం 10లీటర్ల నీటితో 8నిమిషాల్లో ఒక ఎకరం పిచికారీ పూర్తవుతుందని, ఇది శ్రమను తగ్గించడంతో పాటు చీడపీడల నియంత్రణలో అత్యంత సమర్థవంతమైన పద్ధతిగా ఉపయోగపడుతుందని వివరించారు. కార్యక్రమంలో ఇన్చార్జి సహాయ సంచాలకులు రాజనారాయణ, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు శ్రీనివాస్, ప్రవీణ్, ఇఫ్కో ప్రతినిధి చంద్రబాబునాయుడు, ప్రాథమిక సహకార సంఘం సిఈవో నర్సింలు, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ

**హవేలీఘనాపూర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

హవేలీఘనాపూర్ మండలపరిధిలోని దూప్‌సింగ్ తండావాసులకు లయన్స్‌క్లబ్ ఆఫ్ మెదక్ మంజీర ఆధ్వర్యంలో దాదాపు 70 కుటుంబాలకు మంగళవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భం జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ మెదక్ ఆధ్వర్యంలో మెదక్, కామారెడ్డి జిల్లాలో వరదలతో ఇబ్బందులుపడిన తండావాసులకు తమ క్లబ్ అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో బసవేశ్వరరావు, గంప రమేష్, వైస్‌గవర్నర్ నర్సింహారాజు, ప్రవీణ్, పద్మావతి, సూర్యనారాయణ, రాయకంటి నాగరాజు, కిషన్‌గుప్త, లయన్స్ క్లబ్ మెదక్ మంజీరా అధ్యక్షులు వనపర్తి వెంకటేశం, కార్యదర్శి వెంకటరమణ, రాజు, నీలకంఠం, డాక్టర్ పి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల సంరక్షణతోనే పర్యావరణ పరిరక్షణ

**-దుబ్బాక పురపాలక కమిషనర్ కె.రమేష్‌కుమార్**




మొక్కలు నాటుతున్న దృశ్యం

**దుబ్బాక, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

మొక్కల సంరక్షణతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతలు వారే చేపట్టాలని దుబ్బాక పుర కమిషనర్ కే.రమేష్ కుమార్ సూచించారు. సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం దుబ్బాక పట్టణశివారులోని దుంపలపల్లికి వెళ్లే చెరువు కట్ట రహదారిపై నిర్వహించిన "నాటుదాం ఒక మొక్క అమ్మ పేరు మీద" (ఏక్ పెడ్ మాకే నామ్) కార్యక్రమంలో ఆయన పాల్గొని, మొక్కలునాటారు. ఈ సందర్భంగా పురపాలికలో విధులు నిర్వహిస్తున్న 100 మందికి పైగా ఉద్యోగులు, సిబ్బంది ఒక్కొక్కరు ఒక్కో మొక్కను నాటి, వాటికి ట్రీగార్డులను అమర్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పురపాలికలోని అన్ని ప్రభుత్వపాఠశాలలో, ఇతర కార్యాలయాల్లో నేడు నాటేందుకు అవసరమైన మొక్కలను పురపాలిక కార్యాలయం నుంచే పంపిణీ చేశామన్నారు. మొక్కలతోనే మానవ మునగడ సాధ్యమవుతుందని, చెట్టే జీవరాశి మనుగడకు ఆధారమని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో పురపాలిక మేనేజర్ శ్రీనివాస్, సీనియర్ అకౌంటెంట్ అనిల్‌రెడ్డి, వార్డు అధికారులు, మెప్మా ఆర్పీలు, పుర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్తు తరాలను కాపాడుకుందాం

**-తూంకుంట నర్సారెడ్డి**



మొక్కనునాటి నీళ్లు పోస్తున్న తూంకుంట నర్సారెడ్డి

**గజ్వేల్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకొని తల్లి పేరిట ఒక మొక్క నాటాలనే వినూత్న కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రజలు భాగస్వామ్యం చేస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్‌లో మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆంక్షరెడ్డి, ఎఎంసి వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్, ఎఎంసి కార్యదర్శి జాన్ వెస్లీతో కలిసి మొక్కలునాటారు. కార్యక్రమంలో సుఖేందర్‌రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, కరుణాకర్‌రెడ్డి, వహీద్, నరసింహారెడ్డి, అక్కారం యాదగిరి, నర్సాగౌడ్, హరినాథ్, ఉప్పల శ్రీను, రామాగౌడ్, భానుప్రియ, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యశిబిరం సద్వినియోగం చేసుకోవాలి

**కంగ్టి, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

కంగ్టి మండలంలోని రాజారామ్ తాండ గ్రామంలో వైరల్ ఫీవర్ వ్యాప్తి చెంది ప్రజలు బాధపడుతున్నారు. దాంతో మంగళవారం తుర్కవడగం సబ్ సెంటర్ వైద్యాధికారి సంగమేష్ బృందం గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరికి వైద్యచికిత్సలు, వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తున్నారు. ఈమేరకు ఆరోగ్య మెళుకువలపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. అవగాహనలో భాగంగా గత వారాంతం నుండి భారీగా కురిసిన వర్షానికి, కొత్తగా నీరు రావడంతో, ఇలాంటి వ్యాధులు వస్తున్నాయని, ప్రతి ఒక్కరు త్రాగే నీళ్లను వేడిచేసి, చల్లారిన తరువాత త్రాగాలని, కుళాయి నీరు పరిశుభంగా ఉంచుకోవాలని, ఇంటిచుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని గ్రామప్రజలకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రాజుపవార్, మాజీ సర్పంచ్ పల్లవి పరశురాం, మాజీ ఎంపిటిసి సాలిబాయి గంగారాంలు తమ ఆరోగ్యం పరీక్షలు చేసుకుని మాత్రలు తీసుకున్నారు, కార్యక్రమంలో ఎఎన్ఎం శ్రీలత, ఆశ సంగీత తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలతోపాటు తల్లి అదృశ్యం



పిల్లలతో పాటు అదృశ్యమైన తల్లి భవానితోపాటు ఇద్దరుపిల్లలు

**నర్సాపూర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

కన్న పిల్లలతోపాటు తల్లి అదృశ్యమైన సంఘటన నర్సాపూర్ మండల పరిధిలోని నారాయణపూర్‌గ్రామంలో చోటుచేసుకుంది. ఈసంఘటన వివరాలు ఎస్సై లింగం కథనంప్రకారం ఇలా ఉన్నాయి. మండలపరిధిలోని నారాయణపూర్‌గ్రామానికి చెందిన మాణిక్యరాజుకు సికింద్రాబాద్ బాలాజీనగర్‌కు చెందిన భవానితో 8సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. కాజు ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడని తెలిపారు. వీరికి ఒకపాప లోకేశ్వరి (4), బాబు అనిరుద్(1) ఉన్నారు. కాగా ఐదు నెలల క్రితం భార్యాభర్తలు గొడవపడగా భార్య భవాని తన పుట్టింటికి వెళ్ళిపోయింది అని తెలిపారు. ఈనెల 8న తల్లిదండ్రులు, పెద్దలు నచ్చజెప్పి భార్య భవానిని అత్తగారిల్లైన భర్త రాజు వద్ద ఉంచివెళ్లారు. ఈక్రమంలో ఈనెల 9న మంగళవారం బాబుకు జ్వరంవచ్చిందని భార్యాభర్తలతోపాటు అత్త, ఆడబిడ్డ కూడా అందరుకలిసి నర్సాపూర్ ఆసుపత్రిలో చూపించడానికి వచ్చారు. వీరిని ఆసుపత్రిలోనే ఉంచి భర్త రాజు ఆటో నడుపుకోవడానికి వెళ్ళిపోయాడని తెలిపారు. ఈక్రమంలో భార్య భవాని ఓపి చీటీ తీసుకొస్తానని అత్త, ఆడబిడ్డతో చెప్పి పిల్లలతోపాటు వెళ్ళిందన్నారు. ఎంతసేపటికీ భవాని తిరిగి అత్తవద్దకురాలేదని తెలిపారు. విషయం తల్లిద్వారా తెలుసుకున్న రాజు వెంటనే ఆసుపత్రికి వచ్చి చుట్టుపక్కల బంధువుల వద్ద ఎంత వెదికినా భార్య భవాని, పిల్లల ఆచూకీ తెలియలేదు. దీంతో నర్సాపూర్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. భర్త మాణిక్యరాజు ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.లింగం తెలిపారు.


చేర్యాలలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

## యూరియా ఇవ్వడం లేదని రైతుల ఆందోళన

**చేర్యాల, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** యూరియా బస్తాల కోసం రైతులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. మంగళవారం పట్టణంలోని సిద్దిపేట, జనగామ జాతీయ రహదారిపై రైతులు గంటపాటు పెద్దఎత్తున రాస్తారోకో నిర్వహించారు. గంటల తరబడి క్యూలో నిలబడినా ఒక్కబస్తా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టోకెన్లు ఇచ్చి యూరియా బస్తాలు ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. వ్యవసాయ అధికారులు వారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రోడ్డుపై పెద్దఎత్తున ఆందోళన నిర్వహించడంతో భారీగా వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని రైతులకు ఎంత నచ్చచెప్పినా వినకపోవడంతో జిల్లా వ్యవసాయాధికారి రాధిక ఆందోళనవద్దకు చేరుకుని టోకెన్ తీసుకున్న ప్రతి ఒక్కరికి యూరియా అందేలాచూస్తామని తెలపడంతో ధర్నాను విరమించుకున్నారు. అలాగే యూరియాను తప్పుదోవ పట్టిస్తున్న అధికారులపై చర్యలు తీసుకుని రైతులకు సరిపడా యూరియా అందేలా చూడాలని డిమాండ్‌చేశారు.

## కేంద్రం చేస్తున్న అభివృద్ధిపై ఇంటింటా ప్రచారం


ఇంటింటా తిరిగి కరపత్రాలను అందిస్తున్న నాయకులు

**చేర్యాల, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** సంపర్క్ అభియాన్ యోజన కార్యక్రమంలో భాగంగా కడవేర్గులో గ్రామంలో ఇంటింటికి తిరిగి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, అభివృద్ధిపనులను ప్రజలకు ఆ పార్టీ నేతలు వివరించారు. ఈ సందర్బంగా బిజెపి మండల అధ్యక్షుడు వడ్లకొండ సంజీవులుగౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం బిజెపి ప్రభుత్వం అందిస్తున్న పథకాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బిజెపి జనగామ జిల్లా ఉపాధ్యక్షుడు దేవరాయ ఎల్లయ్య పాల్గొని మాట్లాడారు. నరేంద్రమోడి పాలనలో ఎక్కడా అవినీతికి తావులేదన్నారు. ప్రతిఒక్కరికీ బిజెపి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కర్క తిరుపతిరెడ్డి, నాయకులు పోతుగంటి రామదాసు, మన్నె సత్యవర్ధన్, తౌట బాలరాజు, కుర్రారం బాలనర్సయ్య, పోలీజు రవి, ఖాత నాగరాజు పాల్గొన్నారు.

## పరిశుభ్రంపై ప్రతి ఒక్కరూ దృష్టిపెట్టాలి

### మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**హుస్నాబాద్ టౌన్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** పట్టణంలోని ప్రతి ఒక్కరూ పరిశుభ్రంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్ అన్నారు. మంగళవారం పట్టణంలో మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 100 రోజుల కార్యాచరణలో విజయవంతంగా పూర్తయిన సందర్బంగా మున్సిపల్ కార్మికులు, సిబ్బందితో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గడిచిన వంద రోజుల్లో ప్రజలకు తడి, పొడి చెత్తల నిర్వహణ, పరిసరాల శుభ్రత, ప్లాస్టిక్ కవర్ల వాడకం నిరోధించడంలాంటివాటిపై అవగాహన కల్పించినట్లు వివరించారు. అంతేకాకుండా కొత్త ఇంటి నంబర్లు, నల్లా కనెక్షన్లు, మిషన్ భగీరధ నీటిని పరిరక్షించి శుద్ద నీటిని అందివడం లాంటి కార్యక్రమాలు చేశామన్నారు. కార్యక్రమంలో ఇంచార్జీ మేనేజరు సంపత్‌రావు, సానిటరీ ఇన్స్‌పెక్టర్ బాల ఎల్లం, ఆర్ఐ ప్రసాద్, జాలిగం శంకర్, రవికుమార్, తదితరులు ఉన్నారు.

## నాటిన ప్రతి మొక్కను కాపాడుకోవాలి : ఎస్ఐ


ఉద్యోగులతో కలిసి మొక్కలు నాటుతున్న ఎస్ఐ రాజు

**కొమురవెల్లి, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** ఒక ఉద్యోగి ఒక మొక్క ఏక్ పెడ్ మాకే నామ్(తల్లి పేరున ఒక మొక్క) కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ రాజు పోలీసు సిబ్బందితో పాటు అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్బంగా ఎస్ఐ రాజు మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను జియో ట్యాగింగ్ చేయాల్సిన బాధ్యత మొక్క నాటిన ఉద్యోగిపై ఉందన్నారు. భావితరాలను దృష్టిలో పెట్టుకొని మొక్కలు నాటాలన్నారు. నాటిన ప్రతి మొక్కను కంటికి రెప్పాల కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడివో, పంచాయతీ కార్యదర్శి, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన మున్సిపల్ కమిషనర్, సిబ్బంది

**గజ్వేల్ టౌన్, సెప్టెంబర్ 9 (ప్రభాతవార్త):**

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్, సిబ్బంది మంగళవారం పట్టణంలోని పాండవుల చెరువు వద్ద మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ 100 రోజుల కార్యక్రమం, వన మహోత్సవంలో భాగంగా ఏక్ పేడ్ మా కే నామ్ అనే నినాదంతో మొక్కలు నాటడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్, ఆర్ఓ, ఆర్ఐ, సానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

# ప్రజాకవి కాళోజీకి ఘన నివాళులు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

తెలంగాణ మాండలికంలో సామాజిక రచనలు చేస్తూ ప్రజలను సామాజికంగా మేల్కొల్పిన గొప్ప ప్రజాకవి కాళోజీ నారాయణరావు అని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి పేర్కొన్నారు. కలెక్టరేట్ లో మంగళవారం ప్రజాకవి, పద్మభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి సందర్బంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాళోజీ సేవలను గుర్తించి ప్రభుత్వం పద్మవిభూషణ్ బిరుదుతో గౌరవించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాళోజీ పుట్టిన రోజును తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించి అధికారికంగా జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తూ భావితరాలకు ఆయన స్ఫూర్తిని అందిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, డిఆర్వో నాగరాజమ్మ, డిఆర్‌డిఏ పిడి జయదేవ్ అర్యా తదితరులు పాల్గొన్నారు.

**సీపీ కార్యాలయంలో...**

కాళోజీ నారాయణరావు ఒక వ్యక్తి కాదు శక్తిగా ప్రజల గుండెల్లో ఒదిగిన మహనీయుడని అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి.హెచ్.కుశాల్కర్ అన్నారు. కాళోజీ నారాయణరావు జయంతి పురస్కరించుకొని


కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

సీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్ర భారతంలో, తెలంగాణ ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లారని తెలిపారు. తన కలంతో ఎన్నో కవితలు రాసి ప్రజలను, యువకులను ప్రభావితం చేసిన వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, కార్యాలం సిబ్బంది ఫయాజుద్దీన్, వెంకటేశ్వరరావు, నిమ్మల అలీషా, అపూర్వరెడ్డి, పద్మారావు, నితిన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎస్టీయూ మండల కార్యవర్గం

## ఎస్టీయూ మండల కార్యవర్గం ఎన్నిక

**చిన్నశంకరంపేట, సెప్టెంబరు 9,ప్రభాతవార్త:** ఎస్టీయూ మండల కార్యవర్గాన్ని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్టీయూ మండల అధ్యక్షులుగా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా సతీష్, ఆర్థిక కార్యదర్శిగా శివకుమార్‌లు నియమితులైనట్లు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల కోసం ఎస్టీయూ ఎప్పుడూ ముందుంటుందని వారు తెలిపారు. సీపీఎస్ రద్దు చేసే వరకు ప్రభుత్వంతో పోరాడుతామని మండల అధ్యక్షుడు సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా బాధ్యులు శివ ప్రసాద్, నరేష్, నాగరాజు, శ్రీకాంత్, వేణుగోపాల్, హనుమంతు, సంతోష్, సమ్మియుద్దీన్, వినయ్, నవీన్‌లు ఉన్నారు.

## మాకు అన్యాయం చేయొద్దు..డబుల్‌బెడ్‌రూం ఇళ్ల లబ్దిదారులు


ఆర్డీవోకు వినతిపత్రం అందచేస్తున్న లబ్దిదారులు

**జోగిపేట, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** అందోలు-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్‌రూంలకు సంబంధించి నోటీసులు అందుకున్న లబ్దిదారులు మంగళవారం ఆర్డీవో పాండుకు వినతిపత్రం అందచేశారు. గత ప్రభుత్వం హయాంలో అందచేసిన డబుల్ బెడ్రూంలలో కొంతమంది అమ్ముకున్నారని, మరికొందరు వాటిని కిరాయిలకు ఇస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో గత నాలుగు రోజులక్రితం మొత్తం 120 మందికి ఆర్డీవో కార్యాలయం నుంచి షోకాజ్ నోటీసులు అతికించారు. తాళాలువేసి ఉన్న ఇండ్లకు వీటిని అంటించారు. మూడు రోజులలో ఇందుకు సంబంధించి వివరణ ఇవ్వాలని అందులో తెలిపారు. ఒకవేళ వాటిలో ఉండని పక్షంలో వాటిని తామెందుకు తీసుకోవద్దో తెలపాలంటూ అందులో పేర్కొన్నారు. దీంతో ఆందోళనకు గురైన లబ్దిదారులు తహశీల్దారు, ఆర్డీవో కార్యాలయాల చుట్టూతిరుగుతున్నారు. అందులో భాగంగానే మంగళవారంనాడు ఆర్డీవో పాండుకు వినతిపత్రం సమర్పించి, తమకు అన్యాయం చేయొద్దంటూ మొరపెట్టుకున్నారు.

## పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

**దుబ్బాక(అక్బర్‌పేట భూంపల్లి) సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్క ఉద్యోగి తప్పనిసరిగా మొక్కలు నాటాలని అక్బర్‌పేట భూంపల్లి మండల తహసిల్దార్ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. ఎంప్లాయ్ వన్ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం అక్బర్‌పేట భూంపల్లి మండల కేంద్రంలోని తాహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మల్లికార్జున్ రెడ్డి మొక్కను నాటారు. అలాగే దుబ్బాక మండల పరిధిలోని హబ్సిపూర్ గ్రామంలో మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో పాఠశాల ప్రిన్సిపాల్ గోపాల్ రెడ్డి మొక్కలు నాటారు. వీరితో పాటు తోటి ఉద్యోగులు తల ఒకటిగా మొక్కలను నాటారు. ఈ సందర్బంగా తహసిల్దార్ మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉద్యోగులు తల ఒకటిగా మొక్కలను నాటి, వాటి సంరక్షణ కూడా ఉద్యోగులు చూసుకోవాలని తెలిపారు. మొక్కలు నాటడంతో భవిష్యత్ తరాలకు వృక్షాలుగా మారి పర్యావరణాన్ని పరిరక్షించుకొని ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ వెంకట నరసయ్య, సీనియర్ అసిస్టెంట్ సంతోష్, ఉద్యోగులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి


అందోలులో వరిపంటను పరిశీలిస్తున్న వ్యవాసయ శాస్త్రవేత్తలు

## వరి పంటలో పసుపు రంగు తెగులు ఉధృతి

### రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు

**జోగిపేట, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** వరి పంటలో పసుపు తెగులు ఉధృతి కనిపిస్తోందని సంగుపేట రైతువిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ అరుణ, రాహుల్ విశ్వకర్మ అన్నారు. మండల పరిధిలోని అందోలు గ్రామంలో మంగళవారం వరిపంటను వారు పరిశీలించారు. ఈ సందర్బంగా వరి పంటలో బ్యాక్టీరియా ఎక్కువగా కనిపిస్తోందని, ఆకుపై పసుపురంగు మచ్చలు ఏర్పడుతున్నాయని తెలిపారు. ఎడతెరపిలేకుండా కురిసిన వర్షాలవల్ల ఈ పరిస్థితి ఏర్పడినట్లు వారు తెలిపారు. దీని నివారణకు తెగులు ఆశించిన పొలంలో ఒకటికి రెండుసార్లు పూర్తిగా బయటికి మురుగునీటిని కాలువల ద్వారా పంపాలని వారు తెలిపారు. తెగులు వ్యాప్తిని అరికట్టడానికి అగ్రిమైసిన్ 0.4 గ్రాములు లేదా ప్లాంటోమైసిన్ లేదా పోషామైసిన్ 0.2 గ్రాములు ఐదు నుండి ఏడు రోజుల వ్యవధిలో పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు మాణయ్య, యంగ్ ప్రొఫెషనల్ ఆర్.మనోజ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## గోసాయిపల్లిలో తాగునీటి కష్టాలు

**సిర్గాపూర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** మండలంలోని గోసాయిపల్లిలో ప్రజలు తాగునీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. గ్రామానికి మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు తమ గొంతులను తడార్పుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. గ్రామంలోని మంచినీటి పథకానికి సంబంధించిన త్రీఫేజ్ మోటారు కాలిపోవడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గ్రామస్థులు తాగునీటి కొరకు పడుతున్న పట్లను గమనించిన పంచాయతీకార్యదర్శి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందిస్తున్నా ప్రజలు ట్యాంకర్ల నుంచి నీటిని తెచ్చుకునేందుకు కష్టపడాల్సి వస్తున్నందున అధికా రులు స్పందించి సమస్య పరిష్కారిని చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు సూచిస్తున్నారు.

## ఘనంగా కాళోజి జయంతి వేడుకలు


పాఠశాలలో కాళోజి జయంతి వేడుకలను జరుపుకుంటున్న దృశ్యం

**సిర్గాపూర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** ప్రజాకవి, తెలంగాణ ఉద్యమకారులు కాళోజి నారాయణరావు జయంతిని పురస్కరించుకుని మండలంలోని ఆయా పాఠశాలల్లో మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. మండంలోని టిజి టిడబ్లుజె ఆర్‌సి ఎస్టి గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ ప్రియాం ఆధ్వర్యంలో కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగు అధ్యాపకురాలు మాధురిచౌహాన్ తోటి ఉపా ధ్యాయులకు పెన్నులు అందచేశారు.

**మండల పరిషత్‌లో...**

**న్యాల్‌కల్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా కవి, తెలంగాణ ఉద్యమకారులు డాక్టర్ కాళోజి నారాయణరావు జయంతి వేడుకలను అధికారులు ఘనంగా జరుపుకున్నారు. కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కాళోజినారాయణరావు చిత్రపటానికి ఎంపిడిఓ శ్రీనివాస్, ఉపాధి హామి ఏపిఓ రంగారావు, కార్యాలయ అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా అర్పించారు.


ఎంపిడిఓ కార్యాలయంలో కాళోజికి నివాళులర్పిస్తున్న అధికారులు


మాట్లాడుతున్న శంకర్‌బాబు

## యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం

### బిజెపి పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు

**హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 9,ప్రభాతవార్త:** రైతులకు యూరియా సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమయిందని బిజెపి పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు అన్నారు. మంగళవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గడిచిన 11 సంవత్సరాలలో ఎప్పుడూ లేనివిధంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిననాటి నుండి కృత్రిమ కొరతను సృష్టిస్తూ రైతులను అయోమయానికి గురి చేస్తున్నారన్నారు. వర్షాకాలానికి సంబందించి ఏప్రిల్ నుండి సెప్టెంబరు వరకు కేంద్రం రాష్ట్రానికి రావాల్సిన వాటాను పంపిణీ చేసినప్పటికి రాష్ట్రంలో కృత్రిమ కొరత సృష్టించి దళారులకు లబ్దిచేకూరే విధంగా వ్యవహరిస్తుందన్నారు. కేంద్రం నుండి రాష్ట్రానికి ఇప్పటివరకు 8 లక్షల మెట్రిక్‌టన్నుల యూరియా వచ్చిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో పరిపాలన చేతకాని కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రైతులలో గందరగోళం సృష్టించకుండా యూరియాను సక్రమంగా సప్లై అయే విధంగా చూడాలని, లేకుంటే ముఖ్యమంత్రి రాజీనామా చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగార్జున్, వెంకటేష్, రాజేందర్, సాయిరాం, రాజు, సమ్మయ్య, రవిందర్, అనంతస్వామి, నరేష్ తదితరులు ఉన్నారు.

## నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి : సిఐ

**చేర్యాల, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని సిఐ శ్రీను తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మాకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరు మొక్కలను నాటాలనే లక్ష్యంతో మంగళవారం సిఐ శ్రీను పట్టణ శివారులోని పాత పోలీస్ క్వార్టర్స్ స్థలంలో ఎస్సై నవీన్, మున్సిపల్ కమీషనర్ నాగేందర్‌తో కలిసి సుమారు 150 మొక్కలను నాటారు. ఈ సందర్బంగా సిఐ మాట్లాడుతూ భవిష్యత్ తరాలు భూమిపై మనుగడ సాగించడాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

**కోహెడ, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** మండల పరిధిలోని గుండారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటిగా పనిచేస్తున్న మోర గణేష్ జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. దీంతో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైనా గణేష్‌ను గ్రామస్తులు, తోటి ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం భూపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, ప్రభాకర్, రేణుక, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అశోక్‌రెడ్డి, కోటేశ్వర్, బుట్టి లింగం, బాబు, ముక్కెర శ్రీనివాస్, రజిత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## లయన్ నాగేందర్ ఆధ్వర్యంలో అన్నదానం

**గజ్వేల్ టౌన్, సెప్టెంబర్ 9 (ప్రభాతవార్త):** పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తా వద్ద మంగళవారం ఆర్యవైశ్య నాయకుడు, లయన్ నాగేందర్ శైలజ దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గజ్వేల్ మాజీఉపసర్పంచ్ నంగునూరి సత్యనారాయణ, లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ సంజయ్‌గుప్తాలు మాట్లాడుతూ అన్నదానం మహాదానమని, పితృపక్షాల సందర్భంగా అన్నదానం చేస్తే పితృదేవతలకు మోక్షం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ నేతి శ్రీనివాస్, ఇటిక్యాల తాజా మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్, సేవారత్న అవార్డు గ్రహీత దొంతుల సత్యనారాయణ, దూబకుంట లక్ష్మణ్, గందె సంతోష్, అమర నిఖిల అఖిల్, అమర శైలజ, నాగేందర్ పాల్గొన్నారు.

## ఫొటోలను చిత్రించడం ఒక అద్భుతమైన కళ : ఎస్ఐ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ అభిలాష్

**కోహెడ, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** ఫొటోలను చిత్రించడం ఒక అద్భుతమైన కళ అని ఎస్ఐ అభిలాష్ అన్నారు. హైదారాబాద్‌లో ఈనెల 19, 20, 21వ తేదీలలో జరిగే ఫొటో ట్రేడ్ ఎక్స్ పోస్టర్‌ను మండల ఫొటో వీడియో గ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్ఐ అభిలాష్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ టెక్నాలజీ పరంగా ప్రపంచం ముందుకు వెళ్తున్న తరుణంలో ఒకప్పటి ఫొటోగ్రాఫీకి ఇప్పటి ఫొటోగ్రఫీకి చాలా మార్పులు వచ్చాయన్నారు. త్వరలోనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) రాబోతుందన్నారు. వృత్తిలో మరింత నైపుణ్యాన్ని పెంచుకొని ఆర్థికంగా ఎదుగాలన్నారు. ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కెవై చారి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో మండల ఫొటో వీడియో గ్రాఫర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యక్షులు శ్రీధర్, కోశాధికారి శ్రీనివాస్, రాజమల్లయ్య, కొక్కుల బానుచందర్, మంద దయాకర్, శ్రీకాంత్, శ్రీ హర్ష, రమేష్, యాదగౌడ్, అంజి పాల్గొన్నారు.

## ప్రతాప్‌రెడ్డిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**జగదేవ్‌పూర్, సెప్టెంబర్ 9 (ప్రభాతవార్త):** గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మాతృమూర్తి వంటేరు వజ్రమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా విషయం తెలుసుకున్న చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంక రవిశంకర్, మాజీ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డిలు మంగళవారం జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్ గ్రామానికి చేరుకొని వజ్రమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రతాప్‌రెడ్డిని పరామర్శించారు.

## ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం

**గజ్వేల్ టౌన్, సెప్టెంబర్ 9 (ప్రభాతవార్త):** తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో మంగళవారం తెలంగాణ బాషా దినోత్సవాన్ని తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ, అధ్యాపకులు కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మనకి బడిపలుకుల భాష కాదు పలుకుబడుల భాష కావాలని కాళోజి నారాయణరావు నినదించారని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు అనేక అవమానాలు ఎదుర్కొన్న తెలంగాణ భాషకు నేడు మంచి గుర్తింపు వచ్చిందన్నారు. కవులు, కళాకారులు, రచయితలు తన రచనలు, పాటల ద్వారా ఈ భాషకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కాళోజి నారాయణరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

# పచ్చదనంతో పరిశుభ్రమైన వాతావరణం

**జగదేవ్‌పూర్/మర్కూక్, సెప్టెంబర్ 9 (ప్రభాతవార్త):**

పచ్చదనం పెంపొందించడం ద్వారా భవిష్యత్తు తరాలకు పరిశుభ్రమైన వాతావరణం అందించవచ్చని జగదేవ్‌పూర్ ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం తల్లి పేరిట ఒక మొక్క నాటాలనే వినూత్న కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టగా, ఇందులో భాగంగా ఎస్ఐ కృష్ణారెడ్డి, స్థానిక ఎంపిడిఓతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**మర్కూక్‌లో...**

మండల కేంద్రమైన మర్కూక్‌లో స్థానిక ఎస్ఐ దామోదర్, పోలీస్ సిబ్బంది, పలువురు అధికారులు మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను సంరక్షించినట్లయితే భవిష్యత్ తరాలకు మంచి వాతావరణం అందించిన వారమవుతామన్నారు.


జగదేవ్‌పూర్‌లో మొక్క నాటుతున్న ఎస్ఐ కృష్ణారెడ్డి


మర్కూక్‌లో మొక్క నాటుతున్న ఎస్ఐ దామోదర్

## బోరంచ జడ్పిహెచ్ఎస్‌లో తెలుగుభాషా దినోత్సవం



తెలుగుభాషా దినోత్సవం జరుపుకుంటున్న ఉపాధ్యాయులు

**మనూర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని బోరంచ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలలో తెలుగు బోధిస్తున్న ఉపాధ్యాయులతో పాటు అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని డివిజన్ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన బోరంచ జడ్పీహెచ్ఎస్‌లో పీడిగా విధులు నిర్వహిస్తున్న రవికుమార్, మండల ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న అశోక్‌లను కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బైండ్ల కృష్ణ ఉపాధ్యాయులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బైండ్ల కృష్ణ మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం ఆనదంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు మహేష్‌కుమార్, సిహెచ్ నరసప్ప, అశోక్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పంటల వివరాల నమోదు



ముక్తాపూర్‌లో పంటల వివరాలను నమోదుచేస్తున్న ఎఈఓ వినయ్

**నాగల్‌గిద్ద, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని ముక్తాపూర్, మావినెల్లి, గౌడ్గం జన్వాడ గ్రామాల్లో రైతులు సాగు చేసుకుంటున్న పంటల వివరాలను ఏఈఓ వినయ్ మంగళవారం నమోదు చేస్తున్నారు. రైతులు సాగు చేసుకుంటున్న పంటలను పరిశీలించడంతో పాటు ఈ క్రాప్ బుకింగ్ పోర్టల్‌లో ఆప్‌డేట్ చేస్తాన్నారు. రైతులు తాము సాగు చేసుకుంటున్న పంటల వివరాలను విధిగా నమోదు చేసుకోవాలని, పంట చేతికి అందాక మార్కెట్‌లో విక్రయించుకునే సందర్భంలో పంటల వివరాలను నమోదు చేసుకున్న వారికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని, అందుకు పంటల వివరాలను నమోదు చేసుకోవాలని ఏఈఓ వినయ్ సూచించారు.

## రోడ్డుపై చెరువు నీరు-ముందుకు పోయేదెలా సారు

**-ఇబ్బందులు పడుతున్న వడ్డి, డప్పూర్ గ్రామస్థులు**



వడ్డి-డప్పూర్ రోడ్డుపై నీరు నిల్చున్న దృశ్యం

**న్యాల్‌కల్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని వడ్డి-డప్పూర్ గ్రామాల శివారులోని డప్పూర్ వాగు నీరు రోడ్డుపైకి చేరడంతో అటుగా ప్రయాణించే ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. రోడ్డుపై కల్వర్టు వద్ద నీరుచేరడంతో అటుగా ద్విచక్ర వాహనంపై ప్రయాణించేందుకు వాహనచోదకులు భయాందోళనలకు గురవుతున్నారు. నిత్యం ఈదారి గుండానే డప్పూర్, వడ్డి గ్రామాల రైతులు పొలాలకు వెళుతుంటారు. రోడ్డుపై నిల్చున్న నీటి గుండా రోడ్డు దాటేందుకు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## కోర్పల్ జడ్పిహెచ్ఎస్‌లో తెలుగుభాషా దినోత్సవం



తెలుగుభాషా దినోత్సవం జరుపుకుంటున్న ఉపాధ్యాయులు

**చౌటకూరు, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని కోర్పల్ గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో మంగళవారం ప్రజాకవి కాళోజీ నారాయణరావు జన్మదినాన్ని పురస్కరించుకుని తెలుగుభాషా దినోత్సవాన్ని ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి మండల అభివృద్ధి అధికారి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఉద్యమకారులు, ప్రజాకవి కాళోజీ నారాయణరావు సమాజాభివృద్ధికి అందచేసిన సేవలను కొనియాడారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.అడివప్ప, ఉపాధ్యాయులు మొగులయ్య, మాణెయ్య, బి.శ్రీనివాస్, నాగరాజు, యాదగిరి, తిరుపతిరెడ్డి, ఓంప్రకాష్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ముకుందం, సంజయ్‌కుమార్, మల్లేశం, పంచాయతీ కార్యదర్శి, పాఠశాల మాజీ విద్యాకమిటీ చైర్మన్ రాజకుమార్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## చాకరిమెట్ల ఆలయ హుండీ లెక్కింపు



హుండీ డబ్బులు లెక్కిస్తున్న దృశ్యం

**శివ్వంపేట, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
మండలంలోని చిన్నగొట్టిముక్కల గ్రామశివారులోగల ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయ హుండీ లెక్కింపు మంగళవారం నిర్వహించారు. 6నెలల హుండీ లెక్కించగా 6లక్షల42వేల 43రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఫౌండర్ చైర్మన్ ఆంజనేయ శర్మ తెలిపారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాస్, గ్రామస్థులు నారాయణరావు, నర్సింగరావు, కిషన్‌రావు, చంద్రయ్యరావు, ఆలయసిబ్బంది రామకృష్ణ, ప్రకాష్‌చారి, శివకేశవ సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

# చేపపిల్లల పంపిణీలో ప్రభుత్వం విఫలం

**ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్‌ముదిరాజ్**



మాట్లాడుతున్న శ్రీనివాస్

**సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 9,ప్రభాతవార్త :**
కాంగ్రెస్‌సర్కారు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటివరకు ఉచితచేపపిల్లలను పంపిణీ చేయకుండా ముదిరాజ్‌లకు, మత్స్యకారులకు తీరని అన్యాయం చేస్తోందని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్‌ముదిరాజ్ అన్నారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మేడికాయల వెంకటేశం, ఎంపిటిసిల ఫోరం చిన్నకోడూరు మండల మాజీ అధ్యక్షుడు ఇట్టబోయిన శ్రీనివాస్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ముదిరాజ్‌లకు, మత్స్యకార్మికులకు ఉచిత చేపపిల్లలు పంపిణీ చేయకుండా రేవంత్‌రెడ్డి సర్కార్ ఎగనామం పెడుతుందన్నారు. చేపపిల్లలను వదిలే సమయం గడిచిపోయినా టెండర్ల పేరిట కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. బిఆర్ఎస్ హయాంలో సమయానికి అనుకూలంగా వంద శాతం ఉచిత చేపపిల్లలను పంపణీచేసి ముదిరాజ్‌లను, మత్స్యకార్మికులను ఆదుకున్నారని గుర్తుచేశారు. సర్కార్ వెంటనే పూర్తిస్థాయిలో చేపపిల్లలను పంపిణీచేయాలని లేదంటే మత్స్యసొసైటీలకు నగదుబదిలీచేయాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో కోనయ్యగారి ఎల్లంరెడ్డి, యాదగిరి, శ్రీనివాస్, గాడిచర్ల నాగరాజు, కొత్త శంకర్, యాట రాజేష్, శిలాపూర్ రాజు, మైలారం వంశీ పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యేను కలిసిన యువనాయకులు



పద్మాదేవేందర్‌రెడ్డికి వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

**మెదక్ టౌన్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
జిల్లా పార్టీ అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా వారి నివాసం కొంపల్లిలో మంగళవారం కలిసిన యువ నాయకులు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత ముందంజలో ఉండాలని కలిసికట్టుగా పనిచేసి మెదక్ జిల్లాలోని అన్ని జెడ్పిటిసి ,ఎంపిటిసి సర్పంచ్ ,జిల్లా పరిషత్ ,స్థానాలను కైవసం చేసుకోవాలని బలంగా ఉండాలని బీఆర్ఎస్ పార్టీ ఏ పిలుపు ఇచ్చిన కష్టపడి పనిచేయాలని తెలిపారు. ఇందుకు యువ నాయకులు మాట్లాడుతూ పార్టీ ఏ పిలుపు ఇచ్చిన కష్టపడి పనిచేయాడానికి సిద్ధంగా ఉన్నామని పద్మక్కతోనే అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు కాసాపురం కిరణ్ ,నిజ్జని వినయ్ ,సుడ ప్రసాద్ ,మిట్టపల్లి మధు సంగేపుల్ల రాకేష్ , గుట్ట అక్షయ్ ,దాకూరి అర్జున్ కందనూరి రాహుల్ గౌడ్, కొత్తపల్లి దినేష్ ,బండ హరి శంకర్ పాల్గొన్నారు.

## కార్యక్రమాలు విజయవంతం చేయాలి

**-బిజెపి అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశంగౌడ్**




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు మల్లేష్‌గౌడ్

**మెదక్ టౌన్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
సేవ పక్షం కార్యశాలను మెదక్ బిజెపిపార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధామల్లేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ పార్లమెంట్ కోకన్వీనర్ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ సెప్టెంబర్ 17న ప్రధాని నరేంద్రమోడీ జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు సేవ పక్షం కార్యశాలలో భాగంగా రక్తదాన శిబిరం జిల్లా అన్ని మండలాలు, మున్సిపాలిటీలలో నిర్వహించాలని తెలిపారు. ఒక్కో రక్తదాన శిబిరంలో కనీసం 75యూనిట్లు తగ్గకుండా నిర్వహించాలని తెలిపారు. ఆత్మనిర్భర భారత్, వికసిత్ భారత్ అంశాలపై, మహిళా మోర్చా ఆధ్వర్యంలో అసెంబ్లీలో స్థాయిలో చిత్రలేఖనం నిర్వహించాలని అన్నారు. స్వచ్ఛభారత్, శక్తికేంద్రం, మండలకేంద్రంలో స్వచ్ఛభారత్ చేయడానికి ముందు పరిసరాల ఫోటో, స్వచ్ఛభారత్ నిర్వహించిన తర్వాత పరిసరాలఫోటో, చిన్న వీడియోలు తీసి ఈకార్యక్రమాలకు స్థానిక సెలబ్రెటీలను ఆహ్వానించాలని అన్నారు. నమో మారథాన్, యువమోర్చా ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో 23కిమీ నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంల్లో యువత, విద్యార్థులను భాగస్వామ్యం చేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, సంఘసాని సురేష్, ఈర్ల రంజిత్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, జిల్లా ఉపాధ్యక్షుడు బుచ్చేష్‌యాదవ్, రాజేందర్, శంకర్ గౌడ్, జనగాం ప్రబారి నందారెడ్డి, జిల్లా కార్యదర్శి కల్కి నాగరాజు, అసెంబ్లీ కన్వీనర్ మధుసూదన్, జిల్లా యువమోర్చా అధ్యక్షులు సతీష్, జిల్లా మహిళామోర్చా ప్రధానకార్యదర్శి కవితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాకవి కాళోజీ నారాయణరావు

**-మున్సిపల్ కమిషనర్ దశరథ్**



కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

**గుమ్మడిదల, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం ప్రముఖ కవి, రచయిత, స్వాతంత్ర్య సమరయోధుడు కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆయనచేసిన సేవలను కొనియాడారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ దశరథ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజాసాహిత్యానికి ప్రముఖకవిగా, రచయితగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా, రాజకీయ, సామాజిక కార్యకర్తగా ఎన్నో రకాలుగా దేశానికి సేవలుచేసిన కాళోజీ నారాయణరావు జయంతి జరుపుకోవడం ఒక మహా భాగ్యమని, భావితరాలకు ఆయన సేవలు మార్గదర్శకంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఈవోలు ప్రభాకర్, రాములు, ప్రత్యూష, మున్సిపల్ సిబ్బంది సాయికుమార్, హరీష్, కామేశ్వరి, జై చిత్ర, సరిత, తదితరులు పాల్గొన్నారు.

## చదువుతోపాటు క్రీడలపట్ల ఆసక్తి చూపాలి

**-క్రీడలను ప్రారంభించిన డిఈవో**



క్రీడలను ప్రారంభిస్తున్న డిఈవో

**మెదక్ టౌన్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
పాఠశాల క్రీడల సమైక్య (ఎస్జిఎఫ్) ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రీడాపోటీలు మంగళవారం మెదక్ జిల్లా కేంద్రం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహించడం జరిగింది. ఇందులో 14రకాల విభాగాల్లో పోటీలను నిర్వహించనున్నారు. ఈమేరకు ఈపోటీలకు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల గ్రౌండ్ వేదికైంది. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాధాకిషన్ పాల్గొని క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్జిఫ్ కార్యదర్శి నాగరాజు, పిఈటిల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాస్, మాధవరెడ్డి, నరేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఈఓగా అనురాధ బాధ్యతల స్వీకరణ

**చౌటకూరు, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
మండల విద్యాధికారిగా అనురాధ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మండల కేంద్రమైన చౌటకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న అనురాధను ఎంఈఓగా నియమిస్తూ జిల్లావిద్యాధికారి వెంకటేశ్వర్లు ఉత్తర్వులుజారీచేసి అనురాధకు నియామకపత్రాన్ని స్వయంగా అందచేశారు. ఎంఈఓగా అనురాధ నియామకం పట్ల పిఆర్‌టియు మండలాధ్యక్షులు సి.మోహన్‌రెడ్డి సంతోషం వ్యక్తంచేశారు.

## మండలంలో 25038 మంది ఓటర్లు-ఎంపిడిఓ చంద్రశేఖర్

**మనూర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
మండలంలోని ఆయా గ్రామాల్లో 25038 మంది ఓటర్లు (పురుషులు 12675 మంది, మహిళలు 12363 మంది) ఉన్నారని మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్ తెలిపారు. మండలంలో 22 గ్రామ పంచాయతీలు ఉండగా ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలను పురస్కరించి 50 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకుంటారన్నారు. ముసాయిదా ఓటరు జాబితాపై ఆయా రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించినట్లు వివరించారు.

# సిసి కెమెరాలతో కమ్యూనిటీకి మరింత భద్రత

**-ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**
**-రెండులక్షల రూపాయల సొంతనిధులతో సాయిభగవాన్ కాలనీలో సిసి కెమెరాల ఏర్పాటు**
**-త్వరలో అందుబాటులోకి మినీ ఫంక్షన్ హాల్, పార్కు**



సిసి కెమెరాలను ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎంఆర్, మాజీ వైస్‌చైర్మన్ నరసింహగౌడ్

**అమీన్‌పూర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఏర్పాటవుతున్న నూతనకాలనీలలో భద్రతను పెంచడంలో కమ్యూనిటీ సిసి కెమెరాలు ఎంతగానో ఉపకరిస్తాయని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని న్యూసాయిభగవాన్ కాలనీలో రెండులక్షల రూపాయల సొంతనిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను ఆదివారం ఉదయం ఎమ్మెల్యే జి.ఎం.ఆర్‌తో కలిసి మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహగౌడ్, అమీన్‌పూర్ సిఐ నరేష్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణతో పాటు నేరగాళ్లను గుర్తించటంలో సిసి కెమెరాలు పోలీసుశాఖకు కీలకంగా ఉపయోగపడుతున్నాయని అన్నారు. ప్రతి కాలనీలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవటం ద్వారా నిరంతర నిఘాకు ఆస్కారం ఉంటుందన్నారు. ప్రధాన కేసుల ఛేదనలో సిసి కెమెరాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని అన్నారు. రాష్ట్రప్రభుత్వం హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ప్రతి సిసి కెమెరాను అనుసంధానం చేసి భద్రతాపరమైన సమస్యలు తలెత్తినప్పుడు క్షణాల్లో పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకునేలా నూతన సిసి కెమెరాలను అమలులోకి తీసుకొని వచ్చిందని తెలిపారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు నియోజకవర్గంలో ప్రతి గ్రామం, పట్టణం, డివిజన్లలో కమ్యూనిటీ సిసి కెమెరాల ఏర్పాటుకు కృషిచేస్తున్నామని తెలిపారు. కాలనీ ప్రజల కోసం అతి త్వరలో మినీ ఫంక్షన్ హాల్, పార్కును ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మల్లేష్, బాలరాజు, ప్రమోద్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, కృష్ణ, జగదీష్, దాసు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు



కాళోజీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న తహసీల్దార్ అనుదీప్

**చౌటకూరు, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
ఉమ్మడి పుల్‌కల్ మండలంలో ప్రజాకవి విభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. మండల పరిషత్, రెవిన్యూ కార్యాలయాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కాళోజీ చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మండల కేంద్రమైన చౌటకూరులో తహసీల్దార్ అనుదీప్ రెవిన్యూ సిబ్బందితో కలిసి కాళోజీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సందీప్‌గౌడ్, జూనియర్ అసిస్టెంట్ శైలజయాదగిరి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## లాలకుంట ఎంపిఎస్‌లో తెలుగుభాషా దినోత్సవం



తెలుగుభాషా దినోత్సవం జరుపుకుంటున్న ఉపాధ్యాయులు

**జహీరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
నియోజకవర్గంలోని మండలకేంద్రమైన కోహీర్ పట్టణంలోని లాలకుంట మండల ప్రైమరీపాఠశాలలో మంగళవారం తెలుగుభాషా దినోత్సవాన్ని (కాళోజీ నారాయణరావు జయంతి)ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.రవికుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఘనంగాజరుపుకున్నారు. కార్యక్రమానికి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు శారద ముఖ్యఅతిథిగా హాజరై ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు. ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయులు రవికుమార్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్నాథ్, నర్సింలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆచార్య కళాశాలలో ఘనంగా కాళోజి జయంతి



కాళోజీ జయంతిసభలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ హరికుమార్

**జహీరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
జహీరాబాద్ పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో మంగళారం ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కాళోజీ నారాయణరావు చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల హరికుమార్ పూలమాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎం.వెంటకరామిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నందుగౌడ్, నర్సింలు, దత్తు, నిఖిత, దీపిక, నవీన, లావణ్య, కీర్తి, శ్రావణి, జగదేవి, సురేష్ తదితరులు పాల్గొనగా తెలుగు అధ్యాపకులు ఎం.రమేష్‌ను ప్రిన్సిపాల్, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

## అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి శ్రీకారం



డ్రైనేజీ నిర్మాణానికి శ్రీకారం చుడుతున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
అధికారులతో కలసి మార్నింగ్ వాక్ సందర్భంగా ప్రజలు సూచించిన సమస్యల పరిష్కారానికి తగుచర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్‌కమిటీ సభ్యురాలు బూరుగడ్డ పుష్పనగేష్ పేర్కొన్నారు. మంగళవారం రామచంద్రాపురం డివిజన్‌పరిధిలో 12లక్షల రూపాయలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి కాలనీవాసులు, అధికారులతోకలిసి భూమిపూజా కార్యక్రమాలు నిర్వహించి పనుల నిర్మాణానికి శ్రీకారంచుట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పుష్పనగేష్ మాట్లాడుతూ కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం పనులు పూర్తయ్యాక సిసి రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేస్తామన్నారు కార్యక్రమంలో నాయకులు హబీబ్‌భాయి, మైనార్టీ అధ్యక్షులు హబీబ్ జానీ, పీటర్ పాల్స్, స్రామట్, కృష్ణ, వివేక్, శ్రీనివాస్, రఫీ, బియ్యారి కుమార్, రమేష్, సుంకుస్వామి, రాజురఫీ, షపి తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు కార్యాలయంలో ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు

**-నివాళులు అర్పించిన ఎఆర్ డిఎస్‌పి నరేందర్**

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం తెలంగాణ ప్రజాకవి, పద్మభూషణ్, డాక్టర్ కాళోజీ నారాయణరరావు జయంతిని పురస్కరించుకుని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కాళోజీ చిత్రపటానికి ఎఆర్ డిఎస్‌పి నరేందర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా డిఎస్‌పి నరేందర్ మాట్లాడుతూ తెలుగుసాహిత్యానికి, తెలంగాణ ఉద్యమానికి అక్షరయోధులుగా కాళోజీ నిలిచారని కొనియాడారు. కాళోజీ సమాజనిర్మాణానికి అందించినసేవలను కొనియాడారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇ.కళ్యాణి, డిసిఆర్బీ ఇన్స్‌పెక్టర్ రమేష్, ఎస్బి ఇన్స్‌పెక్టర్ కిరణ్ కుమార్, ఐటిసెల్ ఇన్స్‌పెక్టర్ సదా నాగరాజు, పిసిఆర్ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్‌రెడ్డి, ఫింగర్ ప్రింట్ ఇన్స్‌పెక్టర్ నాగేశ్వర్‌రావు, ఆర్ఐ రామరావు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కాళోజీ సేవలు చిరస్మరణీయం

**-డిఆర్‌ఓ భుజంగరావు**

**మెదక్ టౌన్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజాకవి కాళోజీ నారాయణరావు సేవలు చిరస్మరణీయమని డిఆర్ఓ భుజంగరావు అన్నారు. మంగళవారం కాళోజీ జయంతిని పురస్కరించుకొని జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయన కాళోజీ వ్యక్తిత్వం గురించి మాట్లాడారు. ఆయన రచనలు ప్రజాస్వామ్య, నైతిక విలువలకు ప్రతిరూపమని పేర్కొన్నారు. యువత ఆయన ఆలోచనలనుంచి ప్రేరణ పొందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎవో యూనస్ సంబంధిత అధికారులు పాల్గొని నివాళులు అర్పించారు.